క్లుప్తంగా

నేడు మండల సమావేశం

మాగనూర్: మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ శ్యామలమ్మ అధ్యక్షతన 21న ఉదయం 11గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, ఇతర శాఖల అధికారులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

రైతుసమావేశానికి ఎమ్మెల్యే రాక

మాగనూర్: మండలంలోని రైతువేదికలో నిర్వహించే 3పంటలిచ్చే కేసీఆర్ కావాలా? 3గంటలిచ్చే కాంగ్రెస్ కావాలా..? అనే రైతుసమావేశం నిర్వహించనున్నట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హాజరవుతారన్నారు. రైతులు, ప్రజాప్రతినిధులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, అన్నిగ్రామాల సర్పంచ్‌లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కంపెనీ రద్దయ్యేవరకు పోరాటం చేస్తాం



మరికల్: చిత్తనూర్ ఇథనాల్ కంపెనీని రద్దుచేయాలని చేపట్టిన నిరవధిక దీక్ష గురువారంతో 20వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు రామచంద్రయ్య మాట్లాడుతూ.. పర్యావరణానికి ప్రమాదంగా మారిన ఇథనాల్ కంపెనీ రద్దు అయ్యేవరకు తమపోరాటం ఆగదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కంపెనీ వెనక్కి తీసుకొని తమ గ్రామాలను కాపాడాలని వారు డిమాండ్ చేశారు. లేనిచో కంపెనీని రద్దు చేసేవరకు సంవత్సరాలపాటు ఆందోళన చేస్తామన్నారు. మధు, ఆశన్న, రామకృష్ణ, హుస్సేన్ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఊట్కూరు: ముసురు వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసిల్దార్ తిరుపతయ్య గురువారం ఒక ప్రకటనలో కోరారు. శిథిలావస్థలో ఉన్నఇండ్లు, మట్టిగోడలతో ఉన్నఇళ్లు, నాలలవద్ద ప్రవహించే నివాసంలో ఉండొద్దన్నారు. రైతులు వ్యవసాయబోరుబావులు, కరెంట్ పెట్టిముందు తడిసిన స్టార్టర్ బాక్స్‌లను, ఫ్యూజ్‌బాక్స్‌లను చేతులతో ముట్టుకోవద్దని సూచించారు.

మాగనూర్: వర్షాలు పడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున మండల ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ మల్లేష్ అన్నారు. ఆయన ప్రజలకు పలుసూచనలు చేశారు.

అధికారంలోకి వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే..



మరికల్: వ్యవసాయానికి 24గంటలు ఉచితవిద్యుత్ ఇచ్చేసత్తా బీఆర్‌ఎస్‌కే ఉందని, మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని జెడ్పీవైస్ చైర్‌పర్సన్ సురేఖ అన్నారు. గురువారం మండలంలోని పూసల్‌పహాడ్‌లో రైతులసమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వ్యవసాయానికి కేవలం 3గంటల కరెంట్ ఇస్తామంటూ చెప్పడంతో ఇప్పుడు ఆ పార్టీని ఎవరూ నమ్మెపరిస్థితుల్లో లేరన్నారు. కార్యక్రమంలో సంపత్, విష్ణుకాంత్‌రెడ్డి, సత్యానారాయణరెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సర్వేను త్వరగా పూర్తి చేయాలి

నారాయణపేట: జీఓ 58, 59 ద్వారా వచ్చిన దరఖాస్తులకు సంబంధించిన సర్వేను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సర్వేయర్లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో సర్వే అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జీఓ 58, 59 ద్వారా వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా సర్వే పూర్తి చేయాలన్నారు. నారాయణపేటలో 70 పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని ఈ నెలాఖరు వరకు సర్వే పూర్తి చేయాలన్నారు. నర్వలో 43, మరికల్‌లో 80, మక్తల్‌లో 230, కోస్గి లో 20, ఊట్కూర్‌లో 130, మాగనూర్, కృష్ణాలో 130లో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ నెఖరులోపు పెండింగ్‌లో ఉన్న వాటిని సర్వే చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

విద్యుదాఘాతానికి కాడెద్దు బలి

దామరగిద్ద: పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి కాడెద్దు బలైన సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. బాధితుల వివరాల మేరకు.. మండలానికి చెందిన రైతు సుంగుల నర్సప్పకు చెందిన రెండు కాడెద్దులను పొలంలోని పశువుల కొట్టంలో కట్టేసి మేత వేశారు. కాగా నీటిని తాపేందుకు కాడెద్దులను బోరుదగ్గరకు తీసుకెళ్లారు. నీటిని తాగి తిరిగివస్తున్న ఓ ఎద్దు కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్ పక్కనుంచి వస్తు విద్యుత్ తీగలకు తగిలి అక్కడికక్కడే మృత్యువాత పడింది. జీవనాధారమైన కాడెద్దును కోల్పోయిన రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామ సర్పంచ్ ఆశమ్మ కోరారు.

వరినాట్లు ఆలస్యం

- కృష్ణా, భీమా నదులకు చేరని వరద
- పరివాహక ప్రాంతంలో కనిపించని వరి సాగు
- మరోవైపు వేధిస్తున్న కూలీల కొరత
- ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు



బోరుబావుల కింద వరినాట్లు వేసేందుకు సిద్ధం చేస్తున్న పొలం

కృష్ణా: కృష్ణా, భీమానది పరివాహక ప్రాంతంలోని రైతులు వరినాట్లు ఆలస్యమవుతున్నాయి. ప్రతి సంవత్సరం కూడా జూన్ రెండో వారంలో వరి నారుమళ్లు వేసి జూలై రెండోవారంలో నాట్లు వేసేవారు. ఈ సంవత్సరం సరైన వర్షాలు లేక నదిలో నీళ్లలేక నాట్లు ఆలస్యమవుతున్నాయి. ఒక పక్క వరి నారుమళ్లు వేసి నెలరోజులవుతున్నా నీళ్లలేక నారుమళ్లు వదిలివేసి, కొందరు రైతులు మళ్లీ కొత్తగా నారుమళ్లను వేసుకుంటున్నారు. దీంతో రైతులకు చాలా వరకు నష్టమవుతున్నా మెజార్టీగా రైతులు మళ్లీ వేసుకునేందుకు మొగ్గుచూపుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో బోరుబావుల కింద వరిసాగు ముమ్మరం చేసిన రైతులు. గతమూడు రోజులుగా కురుస్తున్నా వర్షాలకు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే



మురహర్‌దొడ్డిలో వరినాట్లు వేస్తున్న రైతులు

నారుమళ్లు నాట్లు వేసెందుకు సిద్ధంగా ఉండడంతో బోరుబావుల కింద సాగుచేసే రైతులు తమ పనులను ప్రారంభించారు. కృష్ణానది ఎగువన ఉన్న కర్ణాటక, మహారాష్ట్రాల్లో వర్షాలు కురుస్తుండడంతో నదిలోకి నీరు వచ్చే అవకాశం ఉండటంతో వరి నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. మరో పక్క మాత్రం రైతులు నదిలో నీళ్ల వచ్చిన తరువాతనే నాట్లు వేద్దామని ఆలోచిస్తున్నారు. ఏది ఏమైనా ఈ వర్షాలు మాత్రం రైతులకు మేలు చేసేవిగా ఉన్నాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వేధిస్తున్న కూలీల కొరత..



మండలంలోని అన్ని గ్రామాల్లో కూలీల కొరత చాలా ఉంది. గతంలో అయితే బీహార్, ఒరిస్సా, కర్ణాటక నుంచి వరినాట్ల సమయంలో వలస కూలీలు వచ్చేవారు. ఈసారి వారు రాకపోవడంతో చాలా ఇబ్బందులు ఏర్పడుతుంది.

– సంతోష్‌శెట్టి, గుడెబల్లూర్ గ్రామం

ఒకేమారు రావడంతో ఇబ్బందులు..



గ్రామాల్లో ఈ సంవత్సరం ఒకేమారు పత్తిపొలాలకు ఎరువులు పెట్టడంతోపాటు వాటిలో కలుపు తీయడం పనులు, మరోపక్క వరినాట్లు వేయడం ముమ్మరం కావడంతో కూలీల కొరత ఏర్పడింది. ఈ సమయంలో కొందరు రైతులు ఇతర గ్రామాల్లోని కూలీలను ప్రత్యేక వాహనాల్లో తీసుకొచ్చి వ్యవసాయ పనులను చేయిస్తున్నారు. చిన్న రైతులు మాత్రం గ్రామాల్లోని కూలీల ద్వారనే తమ పనులు చేయించుకుంటున్నాం.

– ఇర్పన్న, హిందుపూర్ గ్రామం

జీపీ భవనాలు త్వరగా నిర్మించాలి



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్

నారాయణపేట: గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మద్దూర్, కోస్గి మండలాల ఎంపీడీఓలు, పీఆర్ ఏఈల సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మాట్లాడారు. గ్రామ పంచాయితీ భవన నిర్మాణ పనులపై ఆరా తీశారు. పనులను నాణ్యతగా పూర్తి చేయాలని సంబంధిత ఏఈలకు సూచించారు. పనుల్లో ఎలాంటి తప్పిదాలు జరిగినా వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

లక్కీ డ్రా ద్వారా విద్యార్థుల ఎంపిక..

జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బెస్ట్ అవేలబుల్ స్కీం కింద పాఠశాలల్లో ప్రవేశానికి గురువారం కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్ ఆధ్వర్యంలో విద్యార్థులను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. కార్యక్రమంలో అధికారులు, కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అన్నదాతలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండ

నారాయణపేట రూరల్ : బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్నదాతలకు వివిధ పథకాలను అందించి అండగా నిలిచిందని ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పేరపళ్ల రైతువేదికలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిననాటి నుంచి రైతులను అక్కున చేర్చుకున్న సీఎం కేసీఆర్ అప్పుల ఊబినుంచి ఆదుకున్నారని చెప్పారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సరిపడ అందించి ఎక్కడ ధర్నాలు, రాస్తారోకోలు లేకుండా అందించామన్నారు. రైతుబంధు, రైతుబీమా దేశానికి ఆదర్శంగా నిలిచాయని, ఇతర రాష్ట్రాలు కాపీ కొడుతున్నాయని చెప్పారు. మూడు పంటలకు నీరు ఇచ్చే బీఆర్‌ఎస్ ప్రభుత్వమా.. మూడు గంటలు మాత్రమే కరెంటు ఇచ్చే కాంగ్రెస్ పార్టీనా తేల్చుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ అంజలి, సర్పంచ్ శ్రీదేవి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వేపూరిరాములు పాల్గొన్నారు.

రైతుబీమా చెక్కు అందజేత..

మండలంలోని అమ్మిరెడ్డిపల్లికి చెందిన సంజమోళ్ల నర్సింహులు రైతు ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందారు. వారి కుటుంబానికి మంజూరైన ప్రమాద బీమా రూ.5లక్షల చెక్కును ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అందించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని బరోసా ఇచ్చారు.



పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

దామరగిద్ద: రైతుసంక్షేమమే బీఆర్‌ఎస్ ధ్యేయమని ఎమ్మెల్యే ఎస్ రాజేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కంసాన్‌పల్లిలో రూ. 15 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో మంజూరు చేసిన కమ్యునిటీ భవనానికి, రూ. 20 లక్షల ఈజీఎస్ నిధులతో పంచాయతీ భవనం, వత్తుగుండ్లకు రూ. 20లక్షలతో మంజూరుచేసిన పంచాయతీ భవనాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం సర్పంచ్‌ల గురునాథ్‌గౌడ్ ఆధ్వర్యంలో కంసాన్‌పల్లి రైతువేదికలో ఏర్పాటుచేసిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. రైతులకు అందిస్తున్న ఉచితవిద్యుత్ మొదలు, రైతుబంధు, రైతుబీమా, వంటి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ఎంపీపీ నర్సప్ప, వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి, విండో అధ్యక్షుడు ఈదప్ప, మండల అధ్యక్షుడు ఆశన్న, భీమయ్యగౌడ్, వెంకట్‌రెడ్డి, రాచప్ప, చంద్రకాంత్, కిష్టప్ప, కిషన్‌రావ్, సాయిరెడ్డి,శరణప్ప పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ మండల అధ్యక్షుడిగా అంబాదాస్‌రావు



లయన్స్‌క్లబ్ బీమా అధ్యక్షుడిగా అంబాదాస్‌రావు

మక్తల్: లయన్స్‌క్లబ్ బీమా అధ్యక్షుడిగా మండలానికి చెందిన అంబాదాస్‌రావును ఎన్నుకున్నారు. గురువారం రవి కన్వేన్షన్ హాల్‌లో కో- చైర్మన్ సత్య, ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు ముల్విన్ జోన్స్ చిత్రపటానికి పులమాలవేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని లయన్స్‌క్లబ్ 20ఏళ్లనుంచి సమాజానికి బడుగు, బలహీన వర్గాల వారికీ వివిధరకాలుగా సేవలను అందిస్తుందన్నారు. నూతన లయన్స్‌క్లబ్ మండల అధ్యక్షుడిగా అంబాదాస్ ఎన్నిక కావడంతో ఎమ్మెల్యే ఆయనను సన్మానం చేశారు. రమేష్‌రావు, జనార్ధన్, బస్వరాజ్, శ్రీనివాస్, వీరేషం, కొండయ్య, కోళ్ల వెంకటేస్, నరేందర్, సత్యనారాయణ, అంజిరెడ్డి, శ్రావణకుమార్, రవికుమార్, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్మికుల నిరవధిక సమ్మె



నారాయణపేట రూరల్ : కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేసి, కార్యాలయం ఎదుట సమ్మె కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం జీపీ కార్మికులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. జీఓ 60 ప్రకారం కార్మికుల వేతనాలు పెంచాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చందర్, హన్మంతు, రవి, వెంకటేష్, రాజు, రాయప్ప, చంద్రమౌళి, భీమప్ప, భగవంతు, బాలరాజు పాల్గొన్నారు.

మక్తల్: తమ సమస్యలు పరిష్కరించాలంటూ పంచాయతీ కార్మికులు తలపెట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతుంది. గురువారం చిత్తడి వర్షంలో కూడా కార్మికులు కార్యాలయం ఎదుట బైఠాయించారు. అనంతరం ప్రభుత్వం తమ సమస్యలను సానుకూలంగా స్పందించి పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇఫ్టూ అధ్యక్షుడు కిరణ్, వెంకటేష్, భగవంతు, రాంచద్రి, నర్సింహ, నారాయయణ, శ్రీనివాసులు, నర్సింహ, కిష్టప్ప, నరేష్, సాయన్న, నర్సప్ప, రాజు, ఆంజనేయులు, రాములు, బాల్‌రాజు పాల్గొన్నారు.

కోటకొండను మండలం చేయాలి



నారాయణపేట రూరల్ : మండలంలోని కోటకొండలో 72వ రోజు నిరసన దీక్షలు కొనసాగాయి. గురువారం ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షంలో సైతం సాధన సమితి నాయకులు దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా యాదగిరి, చెన్నప్పయాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటు తర్వాత పరిపాలన సౌలభ్యంకోసం జిల్లాలు, మండలాలు ఏర్పాటు చేశారని, అన్ని అర్హతలు ఉన్న తమ గ్రామాన్ని మండలం చేయాలని ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం తిరస్కరించిందని వాపోయారు. నియోజకవర్గంలో కోటకొండ తోపాటు కాన్‌కుర్తి, గార్లపహాడ్‌లకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రాజు, రాములు, ప్రవీణ్, వెంకట్రాములు, దస్తప్ప, రామకృష్ణ, నర్సింహులు, వెంకటప్ప, వెంకట్రాములు పాల్గొన్నారు.

సమావేశానికి రారు.. సమాచారమందించరు..!

- అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన సభ్యులు
- గైర్హాజరు అధికారులకు మెమోలు జారీకి తీర్మానం

నారాయణపేట రూరల్ : మండల పరిషత్ సమావేశంపై అధికారులు అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి, గైర్హాజరు అవుతున్న విధానంతోపాటు గ్రామాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాలు, తనిఖీల విషయంలో ప్రజాప్రతినిధులకు కనీస సమాచారం ఇవ్వకపోవడంపై మండల పరిషత్ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వురు సభ్యులు అధికారుల తీరును ఎండగట్టారు. సమావేశానికి రాని అధికారులపై చర్యలు తీసుకోవాలని, కిందిస్థాయి సిబ్బందిని పంపిస్తూ సమస్యలపై సరియైన సమాధానం లేకుండానే సమావేశం ముగియడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గైర్హాజరైనా 12మంది అధికారులకు నోటీసులు అందించి వివరణ తీసుకోవాలని, మరో పక్షం రోజుల్లో మరో సమావేశం నిర్వహించాలని తీర్మానించారు. కోటకొండ పీహెచ్‌సీలో 24గంటల వైద్య సదుపాయం అందించే విధంగాస్థాయి పెంచి వైద్యులను ఏర్పాటు చేయాలని కోరారు. జాజాపూర్ డంపింగ్‌యార్డుకు దారి చూపించడంలో రెవెన్యూశాఖ నిర్లక్ష్యంపై నిలదీశారు. చిన్నజట్రం నుంచి నారాయణపేట వచ్చే మార్గంలో ప్రమాదకరంగా ఉన్న కల్వర్టులను మరమ్మతులు చేయాలని కోరారు. అన్ని అర్హతలు ఉన్న కోటకొండను మండలంగా ప్రకటించేందుకు సహకరిస్తూ సభతీర్మానం చేయాలని కోరారు. భోజన అనంతరం సమావేశంలో మధ్యలోనే పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు బయటకు వెళ్లిపోవడంతో సమావేశం ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. జెడ్పీటీసీ అంజలి, వైస్ ఎంపీపీ సుగుణ, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యులు తాజోద్దిన్, ఇంచార్జి ఎంపీడీఓ రాజు, సూపరింటెండెంట్ శోభారాణి తదితరులు ఉన్నారు.



వైద్యశాల సమస్యను సభ దృష్టికి తెస్తున్న సభ్యుడు

పట్టణంలో పారిశుద్ధ్య పనులు

సాక్షి ఎఫెక్ట్..

నారాయణపేట టౌన్: దోమల మోత.. వ్యాధుల బెడద శీర్షికన గురువారం ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. మున్సిపల్ కమిషనర్ సునీత ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో గురువారం హైదరాబాద్ రోడ్‌లోని ప్రధానడ్రెయినేజీల్లో పేరుకుపోయిన మట్టి, చెత్తవ్యర్థాలను జేసీబీ ద్వారా పరిశుభ్రం చేయించారు. అలాగే చేపల, మటన్ మార్కెట్ రోడ్డు పక్కన నిలిచిపోయిన వర్షపు నీటిని, ప్లాస్టిక్ కవర్లు, చెత్తాచెదారం పూర్తిగా తొలగించి తగిన చర్యలు తీసుకున్నారు. ప్రతిఒక్కరూ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి ముందు నీటినిల్వ కాకుండా జాగ్రత్త పాటించాలని ప్రజలకు మున్సిపల్ కమిషనర్ సూచించారు.



డ్రెయినేజీని జేసీబీతో శుభ్రంచేస్తున్న మున్సిపల్ సిబ్బంది

మౌలిక సదుపాయాలు కల్పించాలి

మద్దూరు: మండల కేంద్రంలోని ఎస్సీబాలుర హాస్టల్ విద్యార్థుల మౌలిక సదుపాయల కల్పనపై ప్రభుత్వం దృష్టిసారించాలని ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హాస్టల్‌ను ప్రజాసంఘాల నాయకులు అంజిలయ్యగౌడ్, రాజు, హన్మంతు సందర్శించారు. అక్కడున్న విద్యార్థులతో మాట్లాడారు. అలాగే విద్యాసంవత్సరం ప్రారంభమై నెలన్నరగడుస్తున్నా నేటికీ విద్యార్థులకు బెడ్‌షీట్స్, నోట్‌పుస్తకాలు పంపిణీ చేయలేదన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

ఊట్కూరు: కాంగ్రెస్ పార్టీ పిలుపుమేరకు గురువారం మండలంలోని పులిమామిడిలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధికార ప్రతినిధి, గౌడసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె నాగరాజుగౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రజలకు డబుల్‌బ్రెడూం, దళితలకు మూడెకరాల భూమి ఇస్తామన్న హామీ ఇప్పటికి నెరవేర్చలేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం నిజమాబాద్‌లో పసుపుబోర్డు ఏర్పాటుచేస్తామని ఇంతవరకు చేయలేదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నరేష్, నాయకులు ఆయూబ్‌ఖాన్, తులసిరాజ్ యాదవ్, రహమతుల్లా, యజ్ఞేశ్వర్‌రెడ్డి, రాఘవేంద్రగౌడ్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలని వినతి

ఊట్కూరు: మండలంలోని పెద్దపొర్లలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని గురువారం గ్రామస్తులు ఎంపీడీవో కాళప్పకు వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్మికులు సమ్మెచేయడంతో గ్రామంలో పారిశుద్ధ్యం లోపించి మురుగుకాల్వలో దుర్గంధం వెదజల్లుతుందని, వెంటనే ప్రభుత్వం పంచాయతీ కార్మికులతో చర్చలు నిర్వహించి సమ్మెను విరమింపచేయాలని లేనిచో ఇతరకూలీల ద్వారా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో కృష్ణయ్య, అజయ్, శివరాజ్, లక్ష్మణ్, నర్సింహులు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు

నారాయణపేట రూరల్: ప్రతిపక్ష పార్టీల నాయకులను అక్రమంగా అరెస్టులు చేసి రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న ప్రజావ్యతిరేకతను ఆపలేరని బీజేపీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీ.శ్రీనివాసులు, ప్రభాకరవర్ధన్ అన్నారు. బీజేపీ నాయకులను అరెస్టు చేయడం సరియైంది కాదని విమర్శించారు. వెంకటయ్య, రఘురామయ్యగౌడ్, రాము, సత్యరఘుపాల్, మల్లేష్, సత్యనారాయణ, ప్రకాష్, పాండు ఉన్నారు.

కృష్ణా: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చినహామీలతోపాటూ డబుల్ బెడ్రూంలను క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్తున్న బీజేపీ నాయకులను గురువారం పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేయడం తగదని జిల్లా ఉపాధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పిలుపు మేరకు మండల పార్టీ నాయకులు శాంతియుతవాతావరణంలో వెళ్తున్న సమయంలో ఏఎస్ఐ సురేందర్ తమను అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించారన్నారు. నర్సప్ప, బాల్‌రాజ్, కుర్వరాజు, బీరప్ప, రవి, సిద్దప్ప, శంక్రప్ప, శక్తిసింగ్, జనార్ధన్‌సింగ్, కిష్టప్ప, నాగప్ప పాల్గొన్నారు.

మాగనూర్: బీజేపీ నాయకుల ముందస్తుఅరెస్టు తగదని మండల అధ్యక్షుడు జయనందరెడ్డి అన్నారు. ఇచిన్న హామీ నిలబెట్టుకోలేని అసమర్థ సీఎం కేసీఆర్ అన్నారు. ఆశోక్‌గౌడ్, చంద్రశేఖర్, సుమంత్, రవికూమార్, వాకిటి విష్ణు పాల్గొన్నారు.

మరికల్: డబుల్ బెడ్రూంలను క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్తున్న బీజేపీ నాయకులను గురువారం స్థానిక పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్‌కు నిరసనంగా బీజేపీ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో నిరసన చేశారు. మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, వేణు, కొండయ్య, శ్రీరామ్, వెంకటేష్, నరేష్‌గౌడ్, రమేష్ పాల్గొన్నారు.

కోస్గి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని నియోజకవర్గ కో -కన్వీనర్ కోటకొండ రాము గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నియంతృత్వ దోరణికి నిదర్శనమన్నారు.



పేట పీఎస్‌లో బీజేపీ నాయకులు

ఊట్కూరు: ప్రభుత్వం ప్రజలకు ఇచ్చినహామీలతో పాటూ డబుల్ బెడ్రూంలను క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్తున్న బీజేపీ నాయకులను గురువారం పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్, ఎంపీటీసీ హన్మంతు, మండల అధ్యక్షుడు రమేష్, కృష్ణయ్యగౌడ్, రఘువీర్, ఆశప్ప ఉన్నారు.

మద్దూరు: ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలించానికి వెళ్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని, ఇతర బీజేపీ నాయకులను అరెస్ట్‌చేయడం హేయమైన చర్యఅని మండలాధ్యక్షుడు సుధాకర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

మక్తల్: ప్రభుత్వం ప్రజలకు ఇచ్చినహామీలతో పాటు డబుల్ బెడ్రూంలను క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్తున్న బీజేపీ నాయకులను గురువారం పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టుచేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, కర్నిస్వామి, నాగప్ప, ఈసరినాగప్ప, కుర్వలింగం, రాజు, అంజిలను అరెస్టుచేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

కొలువుదీరిన పీర్లు

అమరచింత: మొహర్రం పండుగను పురస్కరించుకొని పట్టణంలోని పీర్ల మసీదులతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లోని పీర్ల చావిడీల్లో గురువారం ఆలంలు కొలువుదీరాయి. బుధవారం సాయంత్రం పీర్ల పెట్టెలను భక్తిశ్రద్ధలతో కిందికి తీసుకొచ్చిన మసీదుల నిర్వాహకులు గురువారం ఆలంలను అలంకరించి మసీదుల్లో ప్రతిష్ఠించారు. మొహర్రం పది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఆలంలను పూజించి చివరి రోజున నిమజ్జనానికి తరలించడం అనవాయితీ. మొహర్రం ఐదో రోజున తానే అబ్దుల్లా ఆలంను, ఆరో రోజు అబ్బాసలీ ఆలం, ఏడో రోజు ఇమామే ఖాసీం, ఎనిమిదో రోజు అలీ అక్బర్, తొమ్మిదో రోజు ఇమామే హుస్సేన్ ఆలం సవారీతో పీర్ల పండుగ ముగుస్తుందని పట్టణ జామీయా మసీద్ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్ తెలిపారు.



పెద్ద పీర్ల మసీదులో కొలువుదీరిన పీర్లు